క్లుప్తంగా

ప్రత్యేక నిధులివ్వాలి



గౌడ సంఘం నూతన కమిటీ

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలోని గౌడుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అనిల్‌కుమార్ కోరారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం గౌడుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కమిటీ చైర్మన్‌గా మార్క అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా బుర్ర పరశురాములు, వైస్ చైర్మన్‌గా తాటిపాముల సత్యం, పెరుమళ్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పచ్చిమట్ల శ్రీకాంత్, కార్యదర్శులుగా జాగిరు రవీందర్, పైడిపల్లి తిరుపతి, తాళ్లపల్లి సదానందం, బొంగోని శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ గౌడులకు విద్య, వైద్య, సంక్షేమం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని కోరారు.

ఘనంగా స్వాతి నక్షత్రోత్సవం



హోమం చేస్తున్న అర్చకులు

సిద్దిపేటరూరల్: పుల్లూరు లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం బండపై నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పంచకలశ అభిషేకం, సుదర్శన నారసింహ హోమం చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పాడిచేటి శ్రీనివాసాచారి, పాడిచేటి రామకృష్ణ చార్యులు, నశికేత్, సాయికృష్ణ, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, దేవస్థాన డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాలు



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కోహెడ(హుస్నాబాద్): కేరళలో సంభవించిన ప్రకృతి విపత్తుల కారణంగా నిరాశ్రయులైన వారికి ఆర్థిక సహాయం కోసం సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. దేశంలోని సంపన్నులు కేరళ ప్రజలకు చేయూత అందించాలని మండల కార్యదర్శి ముంజ గోపి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోనగిరి శంకర్, పిల్లి రజిత, తాళ్లపల్లి ఎల్లయ్య, బండారు లక్ష్మణ్, సుంకే కనుకయ్య, కాత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ టీటీడీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాదర్‌పుర, కప్పలకుంట, నాసర్‌పుర, గ్రీన్‌కాలనీ, నసీమ్‌నగర్, సల్మాన్‌పుర ప్రాంతాలలో ఉదయం 11 నుంచి 2 వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

30యేళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ

ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగభూషణం



మాట్లాడుతున్న నాగభూషణం

దుబ్బాక: ముప్పైయేళ్లుగా మందకృష్ణ మాదిగ నిరంతర కృషి, పట్టుదల, ఎందరో మాదిగ బిడ్డల త్యాగఫలితంగానే వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిందని ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగభూషణం అన్నారు. ఆదివారం దుబ్బాక డివిజన్ ఎంఈఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణను అమలుచేసి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేయాలన్నారు. 13న మందకృష్ణ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పవన్, శ్రీనివాస్, సంతోష్, పద్మయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.





రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?

నంగునూరులోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొన్ని రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు శ్రావణ మాసం కావడంతో పోచమ్మ దేవాలయానికి బురదలో నుంచి వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. గుంతల్లో నీరుచేరి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంగునూరు నుంచి పోచమ్మ దేవాలయం మీదుగా కొమురవెల్లి, హైదరాబాద్‌తోపాటు అంక్షాపూర్, నర్మేట వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం పనులు చేపటారు. కాని 200మీటర్ల మేర రోడ్డు పూర్తికాలేదు. అధికారుల స్పందించి రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

– నంగునూరు(సిద్దిపేట)

మహిళా మోర్చా బైక్ ర్యాలీ

సిద్దిపేటకమాన్: భారతదేశ జాతీయ సమైక్యతను, స్ఫూర్తిని చాటేందుకు మహిళా మోర్చా, మహిళ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జైహింద్, భారత్ మాతాకీ జై అంటూ హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీ కొనసాగింది. వారు మాట్లాడుతూ దేశ సమగ్రతను పెంపొందించడంలో మహిళలు భాగస్వామ్యం కావడం గొప్ప విషయమన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలే..

- పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: మాయ మాటలుచెప్పి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో 300 బాధిత కుటుంబాలకు రూ.80లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువుఛాయలు కమ్ముకున్నా ప్రభుత్వానికి సోయి లేదన్నారు. నెల రోజులుగా గోదావరి, కృష్ణా జలాలు సముద్రం పాలవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతయేడాది ఈ సమయానికల్లా వాగులు, చెరువులు, కుంటల్లోకి గోదారిజలాలు విడిచిపెట్టామని చెప్పారు. బీఆర్ఎస్ ఒత్తిడి మేరకే రెండు రోజుల క్రితమే మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి నీళ్లు వదిలారని, గతేడాది 1.70లక్షల ఎకరాల్లో వరి సాగు పూర్తవగా ఇప్పుడు కేవలం 25వేల ఎకరాల్లో మాత్రమే సాగు పూర్తయిందని చెప్పారు. పట్టణాలు, గ్రామాలు చెత్తచెదారంతో నిండిపోయాయని ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వదిలి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, కడతల రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య తదితరులు

బ్రహ్మోత్సవాలకు రండి..

దుబ్బాక బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు 13 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను అందజేశారు.

గ్రంథాలయం కోసం నిధులివ్వండి

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి

హుస్నాబాద్: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశాల మేరకు రూ.50లక్షల నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో కాంట్రాక్టర్ భవన నిర్మాణాలు ప్రారంభించారన్నారు. అయితే ఇప్పటి వరకు పూర్తిచేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారని వాపోయారు. అలాగే ప్రహరీ నిర్మించాలని, ఫర్నిచర్, తలుపులు, కిటికీలు, వైరింగ్, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వెంటనే నిధులు విడుదలచేసి భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో రాజు, శంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు రవీందర్

ఆధ్యాత్మికతను పెంపొందించండి

డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు

కోహెడ(హుస్నాబాద్): దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలలో ధూపదీప నైవేద్య పథకంలో భాగంగా పనిచేస్తున్న అర్చకులు గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో శ్రీరంగం రామాచార్యులు, కేశవస్వామి, విష్ణుమూర్తాచార్యులు, శ్రీరంగం నరసింహమూర్తి, మధుసూదనాచార్యులు, ఆంజనేయులు, వేంకటేశ్వర్‌రావు, ప్రభాకరచార్యులు, రవి, సంపత్ కుమార్‌చార్యులు, శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదరావు

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం



పార్టీలో చేరినవారితో హరికృష్ణ

నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్: ఇచ్చినమాట మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు వారిని రాజులుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం మాజీ సర్పంచ్ ముత్యాల దేవేందర్‌తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రైతులకిచ్చిన మాట మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ చేపట్టారన్నారు. సెప్టెంబర్ నుంచి మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, రాజ్‌మహమ్మద్, దేవేందర్, కనకయ్య, చంద్రం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సన్మానం



సన్మానిస్తున్న అరుణ్‌కుమార్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఐఏఎస్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మను బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు చింతల అరుణ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మండల కోకన్వీనర్ సత్యంయాదవ్ పాల్గొన్నారు.

తంజుముల్ మసాజిద్ కమిటీ అధ్యక్షుడిగా మతిన్



మతిన్‌ను అభినందిస్తున్న నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్: గజ్వేల్‌లోని తంజుముల్ మసాజిద్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సయద్ మతిన్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో మతిన్ అధిక మెజార్టీని సాధించి అధ్యక్ష పదవిని కై వసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టీపీసీసీ కార్యదర్శి సాజిద్ బేగ్, శివారెడ్డి తదితరులు అభినందించారు.

చెట్ల నరికివేతకు యత్నం

అడ్డుకున్న యువకులు



వదలి వెళ్లిన కలప

మద్దూరు(హుస్నాబాద్): పాఠశాలల్లోని చెట్లను నరికివేస్తుండగా గ్రామానికి చెందిన యువకులు అడ్డుకున్న ఘటన దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో కొన్నేండ్లుగా ఉన్న సుబాబు చెట్లను సెలవు రోజున గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా నరికి సొమ్ము చేసుకునేందుకు గ్రామానికి చెందిన ఓ కలప వ్యాపారి ప్రత్నించాడు. దీంతో కొంత మంది యువకులు అడ్డుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు అనుమతి తీసుకున్నానని ఆ వ్యాపారి యువకులకు చెప్పాడు. అయినా యువకులు వాగ్వాదానికి దిగడంతో ఆ వ్యాపారి కలపను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. పాఠశాలల్లో పచ్చదనాన్ని కాపాడవలసింది పోయి చెట్లను నరకడం ఎంతవరకు సమంజసమని యువకులు ప్రశ్నిస్తున్నారు. బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై హెచ్‌ఎం లక్ష్మారెడ్డిని వివరణ కోరగా తన అనుమతి కోసం ఆ వ్యాపారి ప్రయత్నించినప్పటికీ తాను ఒప్పుకోలేదని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. గతంలో ఇసుక రవాణదారులను హెచ్చరించినా అక్రమంగా ఇసుక దందా చేస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెల్లవారు జామునే ఇసుక లోడుతో హుస్నాబాద్‌కు వస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్‌పై గతంలో నాలుగు సార్లు జరిమానా విధించినట్లు సమాచారం.

●అ'పూర్వ' సమ్మేళనం

పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయ సమ్మేళనాలను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో కలుసుకొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొని సందడి చేశారు. తమకు విద్యను బోధించిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2001 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు



నంగూరు(సిద్దిపేట): పూర్వ విద్యార్థులతో ఎంఈఓ దేశిరెడ్డి, శ్రీనాకర్‌రెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): ఆత్మీయసమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



అక్కన్నపేట(హుస్నాబాద్): అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

సంక్షిప్త వార్తలు

◆ **సిద్దిపేట డాక్టర్‌కు 'వైద్య బ్రహ్మ'**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ భాస్కర్ 'వైద్య బ్రహ్మ' బిరుదును ప్రదానంచేసినట్లు ఆసుపత్రి సిబ్బంది ఆదివారం తెలిపారు. లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సంస్కృత సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు బిరుదుతోపాటుస్వర్ణ కంకణం అందజేసినట్లు పేర్కొన్నారు.

◆ **స్నేహితుడి కుటుంబానికి చేయూత**

మద్దూరు(హుస్నాబాద్): తమతో చదువుకున్న స్నేహితుడు ఆకస్మికంగా మరణించడంతో తోటి స్నేహితులు అండగా నిలిచారు. దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మీస నర్సింహులు ఇటీవల మరణించడంతో అతనితో 10వ తరగతి వరకు చదువుకున్న స్నేహితులు నర్సింహులు కూతురు నవ్యశ్రీ పేరుమీద రూ.55 వేలు ఫిక్సిడ్ డిపాజిట్‌చేసి భరోసా ఇచ్చారు.

◆ **దేశభక్తిని చాటిన బీజేపీ శ్రేణులు**

కోహెడ(హుస్నాబాద్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు స్థానిక లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని శుభ్రం చేశారు. సమీపంలోని చెత్తచెదరాన్ని తొలగించారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం వెంకటేశం, పిల్లి నర్సయ్య, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్, ముంజ సాగర్, సతీశ్, సుమన్, పవన్‌రెడ్డి, మహేశ్, రాజు, సాయికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన కార్యవర్గం ఎన్నిక**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని హరిహర రెసిడెన్సీ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా సత్యనారాయణగౌడ్, అధ్యక్షుడుగా చంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఐలయ్య, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా దుర్గయ్య, మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా సంతోష్‌కుమార్, రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

◆ **మందకృష్ణకు ఘన స్వాగతం**

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసి ఢిల్లీ నుంచి తిరిగి వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికేందుకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ 13న హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణకు స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి కిష్టయ్య, ఆరెపల్లి కనకయ్య, కందికట్ల రాజు, రాజమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి**

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలోని మహాలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధికారం చెపట్టిన వంద రోజులలోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారన్నారు. వెంటనే మహిళలకు ప్రతినెలా రూ.2500 మంజూరుచేసి వాగ్దానాన్ని నిలుపుకోవాలని కోరారు.

◆ **పోటీ పరీక్షలపై అవగాహన**

గజ్వేల్: పోటీపరీక్షల్లో సత్తాను చాటుకోవడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్‌ను మలుచుకోవాలని పోటీ పరీక్షల శిక్షకుడు ప్రసన్న హరికృష్ణ సూచించారు. ఆదివారం టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీపరీక్షల అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని యూనివర్శిటీ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉన్నత విద్య, గ్రూపు పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ టి.రాజు, ట్రైనర్‌లు అనంతరామకృష్ణ, మహిపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ **అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి**

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి మాజీ సర్పంచ్ కంచం రాజులు(58) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పంజాల శ్రీనివాస్‌గౌడ్, రవి, వల్లాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కంచం యాదగిరి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **రజకులు ఐకమత్యంతో పోరాడాలి**

ములుగు(గజ్వేల్): తమ సమస్యల పరిష్కారం కోసం రజకులందరూ ఐకమత్యంతో పోరాడాలని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ములుగులో నిర్వహించిన మండల రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రజకుల సంక్షేమం గురించి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రతిఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా భూమన్నగారి కనకరాజు, ఉపాధ్యక్షులుగా జూపల్లి నరహరి, సీహెచ్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990